# స్త్రీ

సారధి అద్దంముందు నిలబడి అరగంటైనా అయింది. ముస్తాబులో మూడో వంతుకూడా ముగిసినట్టులేదు. లక్స్ సబ్బుతో రెండుసార్లు రుద్దుకున్న మొహానికి పాండ్స్ స్నో మెత్తుకుని రెమీ పౌడరు అద్దుకున్నాడు. టేబుల్ మీది అద్దానికి దూరంగా దగ్గరగా నడుస్తూ వివిధ కోణాల్లో కోటా సరి జూచుకున్నాడు. సన్నగా దువ్వుకున్న జుత్తుని మళ్ళా దువ్వెన తిరగేసి నొక్కు నొక్కులుగా ఒత్తుకొని కొంతజుత్తు దుబ్బుని నుదురుమీదికి పడేసుకుని సంతృప్తిపడ్డాడు. షర్టు చేతులు మడతలు పెట్టుకుంటూ కంఠందగ్గిర గుండీ తీసి డెస్కులో పడేశాడు. గాబర్డిన్ పాంటులోకి టెర్లిన్ షర్టు టక్ చేసిమచ్చ మచ్చల నైలాను బెల్టు తగిలించాడు. సిల్కు కర్చీఫ్‌మీద నూర్జహాన్ వొంపుకుని, పాలిష్ చేసుకున్న బాటా బూటు కట్టుకున్నాడు. రేడియో కవర్ మీద బుద్ధిగా యెదురు చూస్తోన్న రిస్టువాచ్ అందుకుంటూ .... గాజుల చప్పుడికి గుమ్మంకేసి చూశాడు.

నవ్వుతూ కన్పించింది – "ఓ గంట నుంచి ఇక్కడే నించున్నాను."

'ప్చ్! ఎంత పిచ్చిదానివి! కూర్చోవాలనైనా తెలీలేదూ?'

"రాజావారు బొత్తిగా షోకీళాపురుషులై పోతున్నారు. గంటల కొద్దీ అంతా దరీ లేని ముస్తాబు .... కొంచెం కాటుకకూడా అంటించుకుంటే...."

'థాంక్స్ డార్లింగ్! బాగా గుర్తుచేశావు. ఇవ్వాళే ఓ సుర్మాబాక్స్ కొంటాను. థాంక్స్' అంటూ మళ్ళా అద్దంలోకి చూపులు మళ్ళించుకున్నాడు. సారధి ముస్తాబువరకే షోకీళాపురుషుడు కాడు. అందచందాలు అంగసౌష్టవం – మగవాళ్ళకికూడా మరోసారి చూడాలనిపించే ఆకర్షణ – అన్నీ కలిగిన అదృష్టవంతుడు. ఎల్లప్పుడూ నవ్వుతూనే మాట్లాడగలిగేంత చురుకైనవాడు.

విజయ గుమ్మంలో నిలబడే అంది – "మీరో విషయం గుర్తించారో లేదో, ఇక మనం నిలువుటద్దం కొనాల్సిందే! ఈ చిన్నదాంట్లో .... ఊహూ! మీ అందం పట్టటంలేదు.

"ఫర్వాలేదు డియర్! ఎలాగో ఇబ్బందిపడతాను. నీ మట్టుకు నీ కేం కష్టంగా లేదుగా?"

చిరునవ్వులోనే కోపం ప్రదర్శించింది విజయ.

"అక్కడికి మీరే నవమన్మధులైనట్టు...."

"అబ్బే! ఈ యింటివరకే నే చెప్తూంట...."

"సరేగాని ఎక్కడికేవిటి ప్రయాణం! పెళ్ళినాడుకూడా యిలా సింగారించుకుని వుండరు."

"శోభనంనాడు ఇంకా ఘాటుగా సింగారించుకున్నాను. షాక్ తిన్నట్టు చూశావుగూడాను. మర్చిపోయావు కాబోలు."

"ఛ! మీకు బొత్తిగా సిగ్గులేదు."

"అప్పుడు వుండేది - ఆడదాన్ని పెళ్ళి చేసుకున్నాకే పోయింది."

"కబుర్లుచెప్పి కప్పదాట్లు వెయ్యకండి - ఎక్కడికీ ప్రయాణం?"

"అబ్బా? నిలదీసి అడుగుతున్నావే? మరి చెప్తే బాధపడవుగదా?"

"ఏం అంత బాధపడేచోటుకి బయల్దేరుతున్నారా?"

"ఏమో! ఎవరు చెప్పగలరు? ఆడదానికి అసూయ వుంటుందిగా?"

"పోనీ బాధపడతానని తెలిస్తే మానుకుంటారా?"

"నో, నో, అదేం కుదరదు. వెళ్ళి తీరాలి."

"అందుకే చెప్పి మరీ వెళ్ళండి."

"అయితే చెప్పేస్తున్నాను. తర్వాత నన్నేం అనొద్దు. నువ్వేం అనుకోవద్దు."

"ఈ ఉపోద్ఘాతాలకేంగాని సంగతేమిటో చెప్దురూ!"

"ఓ పిల్ల నన్ను పిలుస్తూంది రోజూ. అందుకని యివ్వాళ తెగించి...."

చురుగ్గా చూసింది విజయ. అంతలోనే నవ్వు తెచ్చుకొంటూ అంది-

"పిల్ల పేరు మల్లిమొగ్గా - మీ పేరు జమీందారునా?"

"నిలదీసి అడిగావు. నిజాయితీగా చెప్పేశాను. తర్వాత నీ యిష్టం."

"పిల్ల దగ్గిరికి వెళ్ళే విషయమైతే బైటికిచెప్పుకుంటారా ఎవరైనా"

"ఎవరి సంగతో నా కెందుకూ? నేనుమాత్రం ఏం చేసినా దాచుకో

కుండా చెప్పేస్తాను. నువ్వు చాలా మంచిదానివి కాబట్టి."

"నేనేం అంత మంచిదాన్ని కాదు, ఆ వెధవ మంచితనం నాకు అక్కర్లేదు."

"అబ్బే! అలా అంటే ఎలా? నువ్వు ఒప్పుకోవుగానీ టొత్తిగా మంచిదానివి."

"ఇలా పొగిడితే నేనేం పొంగిపోను. మీ హాస్యాలకి అర్థం పర్థం లేదేమిటి?"

"హాస్యమా? నీతోనా? ఇప్పుడా? పొరపడుతున్నావు డియర్! ఇది పచ్చి నిజం. నమ్మకపోతే నేనేం చేసేది?"

విజయ కాస్సేపు దీర్ఘంగా చూస్తూ నించుంది — "ఎక్కడుంది పిల్ల?"

"ఆకాశపు అంచునా .... చందమామ చాటునా .... నక్కివున్నానోయ్ బావా! దాగి వున్నానోయ్ — అని పాడుతూంటుంది రోజూ."

"అయితే భూమ్మీద లేదన్నమాట."

"మా ప్రేమ అర్థంచేసుకోలేకపోతున్నావు విజ్జీ! ఊహాలోకాల్లో తేలియాడే నా చిన్నారి లవ్వు — అంటే ప్రేయసి — గోదావరిగట్టున పర్ణశాలలో కూనిరాగాలు తీసుకుంటూ తన్మయంచెందే ఓ జాలరి చిన్నది — ఆహా! ఎంత సుందరంగా వుంటుందనుకున్నావ్? బెదిరి బెదిరి చూసే లేడి కళ్ళూ — పెదవుల్లో దాగివున్న దొండపళ్ళూ — తుమ్మెదల్ని బంధించిన జుత్తుముళ్ళూ ...."

"నీచు నీచుగా కంపువాళ్ళూ ...."

"నో, నో — అదెంత గుడ్ స్మెల్! చేపపిల్లల్ని దేవుకునే ఆ చేతి వేళ్ళతో గంటల తరబడి ఆడుకోగలను. ఊర్వశిగాని నా ప్రేయసిని చూసిందంటే ఉసూరుమనుకుంటూ వెనక్కిపోదూ?"

"ఛీ! మీకు సిగ్గులేదూ?"

"ఎందుకు డియర్? ఎందుకూ?"

"ఎందుకేమిటి? ఏమిటీ పిచ్చిధోరణి?"

"ఎవరిది? నాదా! పిచ్చిధోరణా? గుడ్ గాడ్!"

"హాస్యాలకి కూడా హద్దువుండాలి. ఇంత మోటుతనం పనికిరాదు. మరేమైనా చేయండిగాని యిలా మాత్రం బాధపెట్టొద్దు "

"నేనా? నిన్నా? బాధపెడుతున్నానా? ఎంత అపార్థం!"

"అర్థంలేదు, అపార్థం లేదు. ఇలాంటి విషయం మరెప్పుడూ నా దగ్గిర ఎత్తొద్దు. జీవితంలో ఏ కష్టమైనా సహిస్తానుగాని, యీ దౌర్భాగ్యానికి తట్టుకోలేను."

"పూర్ ఫెలోవి! తప్పదు డార్లింగ్ తప్పదు. ఇదిగో! నేను వెళ్తున్నాను. తలుపేసుకో. రాత్రికి రాకపోవచ్చు."

"మళ్లా ఆ ముక్కనండి, కాళ్ళు విరగ్గొట్టి మూల కూర్చోబెడతాను."

"మైగాడ్ ! అంత శిక్షే?"

"కాక, మీరే వేషం వేస్తున్నా ముద్దు ముద్దుగా చూస్తూ వూరుకుంటానా?"

సారధి నిట్టూరుస్తూ కుర్చీకి అంటుకునిపోయాడు – "పతివ్రతలు భర్తల కాళ్ళు విరగ్గొడుతారా?"

"అవసరమైతే విరగ్గొట్టి భర్తగారికి బుద్ధివచ్చాక బాగుచేయించుకుంటారు – అదే యీ కాలం పాతివ్రత్యం."

"ఛచ్ఛ! ఇది అన్యాయం! సుమతి యిలాగే చేసిందా? ముద్దుకృష్ణుడి పెళ్ళాలంతా యిలాగే చేశారా?"

"పాండు రాజేం చేశాడో – ద్రౌపది మొగుళ్ళంతా ఏం చేశారో కూడా గుర్తు తెచ్చుకుంటారా? ఆ పురాణాలేగా మీ కాధారం?"

"మాటలు నేర్చిన కుక్కని వేటకి తీసికెళ్ళినట్టుంది నా పని – అసలు సంగతి మర్చిపోయి నీతో వాదం వేసుకు కూర్చున్నాను – నా జాలరి చిన్నది – ఎదురు తెన్నులు చూస్తూ వుంటుంది .... వస్తా.... బై బై .... వస్తున్నా ప్రేయసీ! వచ్చేస్తున్నా."

"ఇదిగో! ఏవిటా దూకుడు? మాట."

"సారీ డియర్! సా .... రీ!"

విజయ ఈలవేసుకొంటూ పోతున్న సారథిని చూస్తూ బొమ్మలా నించుంది — "ఛ, ఎవిటీ మనిషి? రోజుకో మేళం! నిజమో తెలీదు, అబద్ధమో తెలీదు."

ఎంతైనా సారథి బొత్తిగా యింత తెగించగలడంటే నమ్మకం కుదరడంలేదు. తప్పుడు పనులు చేసేవాళ్ళు అంత ధైర్యంగా చెప్పుకోగలరా? అయితే ఇదంతా ఉత్త హాస్యమేనా యేమిటి? అదేమోగానీ నవ్వులాటలుకైనా అలాంటి విషయాలు ప్రస్తావిస్తే సహించలేదు విజయ. బాధలూ, బరువులూ, హాస్యాలకి మాత్రం ఎవరు కోరి తెచ్చుకుంటారు? ఏ ఆడది మగవాణ్ణి పరాయి పంచపాలు చేస్తుంది?

తృళ్ళిపడింది విజయ. దిమ్మెరపోయినట్టు అచేతనంగా నిలబడింది. అయితే .... మరి ... రుక్కు అత్త ఆడది కాదా? ఆడదానికి వుండే అసూయా - బాధా అత్తకి లేవా? - అత్త గుర్తు వచ్చినప్పుడల్లా మనస్సు ఆలోచనలతో కొట్టుకుంటుంది — రకరకాల భావాలు చెలరేగుతాయి."

"పాపం! పిచ్చి అత్త!" - అనుకుని జాలిపడా లన్పిస్తుంది.

"ఛా! బొత్తిగా తెలివిమాలింది-" అంటూ విసుక్కోబుద్ధి పుడుతుంది.

"పతివ్రత నైపోదామనే తాపత్రయమో ఏమిటో!-" అంటూ వెటకారం చెయ్యాలనిపిస్తుంది.

"అస్సలు స్వార్ధమే ఎరుగని పుణ్యాత్మురాలు" — చేతులెత్తి దణ్ణం పెట్టాలన్నంత గౌరవమూ కలుగుతుంది — ఏది ఏమైనా అత్త మాత్రం ఆడజన్మకే కాదు — మానవజన్మకే అతీతురాలు! జీవితంలో ఏమీ అనుభవించలేదు. అనుభవించాలని తాపత్రయ పడలేదుకూడాను.

విజయలాంటి ప్రతీ ఆడపిల్లకి రుక్మిణమ్మ ఓ నమస్యే!

*  *  *

ఆ పల్లెటూళ్ళో — వెంకట్రాయుడి భార్య— చిన్నపిల్ల లందరికీ అత్తయ్యే! మధ్యాహ్నంపూట వాళ్ళ మండువాలో జేరి ఆటలాడుకోటం. రుక్కు అత్తతో జడలు వేయించుకోటం ఆ వీధి పిల్లలందరికీ అలవాటు.

తలకో గుప్పెడు శనక్కాయలో — వేపుడు శెనగలో — కారం అటుకులో పెడ్తూవుంటుంది రోజూ.

రుక్మిణికి పిల్లలు లేరు. బహుశా పుడతారనే నమ్మకం కూడా లేదేమో ? అందుకే పిల్లలందర్నీ అంత ముద్దుచేసి వాళ్ళ అల్లరి చూసి నవ్వుతూ కూర్చుంటుంది. ఆ పిల్లల ముఠాలో విజయే కాస్త పెద్దది. పది పన్నెండేళ్ళది. రుక్మిణికి విజయంటే మరీ అభిమానం. కాస్తదూరం చుట్టరికంకూడాను. ఒక్కోసారి రాత్రుళ్ళు కూడా విజయ అత్తదగ్గిరే వుండి పోతుంది.

ఓ రోజు .... పగలు పదిగంటలవేళ అత్తయ్యగారి మండువాలో జేరారు పిల్లలంతా. విజయా — సావిత్రీ — సరోజా — కమలా పచ్చీసు ఆడుకుంటున్నారు. వరలక్ష్మి — సుశీ చింతగింజలు లెక్కపెట్టుకుంటున్నారు. సావిత్రి చెల్లెలూ, కమల పెద్దతమ్ముడూ కాయితాలు చింపుకుని గాలిపటాలు కట్టుకుంటున్నారు. చావిడంతా గోలగోలగావుంది. వెంకట్రాయుడు వీధిలోంచి వచ్చాడు. అతగాడి వెనక మరో ఆడమనిషి కూడా వచ్చింది — ఎర్రగళ్ళ చీర సీలమండల పైకి కట్టుకుంది. కాళ్ళ కడియాలు బాగా కన్పడుతున్నాయి. రెండుచేతులకి బెత్తెడేసి వెడల్పున ముదురు నీలం గాజులున్నాయి. జుట్టంతా గట్టిగా బిగించి కొప్పు వేసుకుంది కుడి చెంప మీద. నల్లగా జిడ్డుగావున్న మొహంలో డబ్బంత ఎర్రబొట్టు మసగ్గా కన్పిస్తోంది — రాయుడు వెనకే నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చింది చావిట్లోకి — పిల్లలేమంత దాని గొడవ పట్టించుకోలేదు. పొలం పనివాళ్ళు కూలికొస్తోంటే మామయ్య ధాన్యం కొలిపించటం అందరికీ మామూలే.

వెంకట్రాయుడు దక్షిణపు గది తలుపులు తోసుకుని వెళ్ళాడు. వెనకే ఆ కూలిమనిషీ గదిలోకి వెళ్ళబోయింది — ఆటల సందట్లో మునిగి పోయిన విజయ హఠాత్తుగా తలెత్తి చూసి అరిచింది — "ఏయ్ ! నువ్వా లోపలికెల్తావేం ? నించో యిక్కడ. మామయ్య తాళాలు తీసుకువస్తాడు. ధాన్యంకొట్టు వాకిట్లోనే వుందిగా ?"

బిత్తరపోతూ గడపకివతలే నించుండిపోయిందా ఆడమనిషి. వెంకట్రాయుడు దాని చెయ్యి పట్టి గుంజి లాగాడు గదిలోకి. అది కాస్తా తలుపు

చాటుకి ఒదిగి నించుంది. దాని బొమ్మ ఎదరగోడకి వ్రేళ్ళాడుతోన్న అద్దంలో స్పష్టంగా కన్పిస్తూంది. చావిట్లోకి. పిల్లలంతా గోలచేసుకొంటూ గదిలో దూరిన కూలిదాన్నీ – అద్దంలో పడుతోన్న దాని బొమ్మనీ చూడ్డానికి గుంపుగా వెళ్ళి పడ్డారు – రాయుడు కోపం నటించి "ఏయ్ ! పోండి! ఇళ్ళకు పోండి ! ఊఁ, చెప్తోంటే కదలరేం ? మళ్ళా మధ్యాహ్నం వచ్చి ఆడుకుందురుగాని .... నడవండి" అంటూ పెద్ద గొంతుతో కేకలేస్తూ పిల్లలందర్నీ చావిట్లోకూడా లేకుండా చెదరగొట్టేశాడు. ఉండేలు చూసిన పిల్లకాకుల్లా చెల్లా చెదరై వీధిలోకి పరుగెత్తారు పిల్లలు.

విజయ ఒక్కర్తీ పడమటింటి గదిలో నక్కింది. వెంకట్రాయుడు మళ్ళా దక్షిణపు గదిలోదూరి తలుపులు బిగించుకున్నాడు. పరికిణీ ఎగరేసుకుంటో వంటపాకలోకి పరుగెత్తింది. విజయ .... "అత్తా! అత్తా! మామయ్యేమో .... ఎవతో అమ్మికూడా గదిలోనేవుంది.... తలుపులన్నీ వేసేశాడు."

"ఎప్పుడే ?–" రుక్మిణి నవ్వుతూ అడిగింది.

"ఇప్పుడే. మేమంతా ఆడుకొంటూంటే వెళ్ళిపొమ్మని కేకలేశాడు. నే నొక్కదాన్నీ నీదగ్గిరకి పరుగెత్తుకు వచ్చేశాను. రా అత్తా ! చూద్దాం మనం."

కందిపచ్చడి రుబ్బుతోన్న రుక్మిణి విరగబడి నవ్వింది– "ఏమిటి చూస్తామే ?"

విజయకి కోపం వచ్చింది – "తలుపు చెక్కలమధ్య పొడుగ్గా చీలిక వుంది కాదేమిటి? చూస్తే ఎందుకు కన్పించదూ?"

"ఛ! పిచ్చిపిల్లా! అలా చూడకూడదు. అటు వెళ్లకు. కూర్చో నా దగ్గర. ఆ పీట తెచ్చుకో – పచ్చడిలో వుప్పుచాలిందో లేదో చూడు." గోరెడు పచ్చడి విజయ చేతిలో పడేసింది. పీటమీద కూర్చుని పచ్చడి చప్పరిస్తూ కుతూహలంగా అడిగింది విజయ– "ఆ అమ్మి ఎవరత్తా?"

"ఎవతో పొలంపనికి వచ్చిందేమో ! మీ మావకి మనసైంది కావున్ను ! అందంగా వుందా ఏమిటి?"

"ఛీ ! దెయ్యంలా వుంది."

ఫక్కుమంటూ నవ్వింది రుక్మిణి — నీకు నచ్చలేదంటే? మీ మావయ్య కళ్ళకి రంభలాగా ఉంటుందే అది! పోనీ నీకు నేను బావుంటానా?"

విజయ అత్తకేసి అభిమానంగా చూసింది. ఆ చూపే అత్త తనకి బాగా నచ్చినట్టు చెప్తోంది — నిజంగానే రుక్మిణి అందంగా ఉంటుంది. పచ్చగా బొద్దుగా ఏ చీర కట్టుకున్నా నిండుగా ఉంటుంది. ఎంత అణచి దువ్వుకున్నా రేగుతూ వుండే చిత్రజుట్టుని అందంగా మెడ మీదికి ముడి చుట్టుకుంటుంది. ఏ రోజూ కాళ్ళకి పసుపూ - కళ్ళకి కాటుకా - మొహాన బొట్టూ బద్ధకించకుండా పెట్టుకుంటుంది. పిల్లా జెల్లా లేరేమో, ఎప్పుడూ ఎడ్డిగా కన్పించక పరిశుభ్రంగా కడిగిన ముత్యంలాగా ఉంటుంది- రాయుడికి పెళ్లామంటే ప్రేమ లేకపోలేదు. గానీ మోజు మాత్రం లేదు. పెళ్ళాం ఏ విధంగా అలంకరించుకున్నా - ఎంత కొత్తచీర కట్టుకున్నా - ఆ సింగారములో ప్రత్యేకతేమీ కన్పించదు. దగ్గరికి రావాలన్నా తహ తహేమీ ఉండదు. తను కట్టుకున్న భార్య అనే అభిమానం సానుభూతి మాత్రం ఎన్నడూ భార్యని అసహ్యించుకొనే లాగ చెయ్యలేదు. సంసార విషయాలలో భార్య సుఖానికి కూడా ఏలోటూ లేకుండానే చూసుకుంటాడు- వెంకట్రాయుడు బాగా పొడగరి. బలిష్ఠమైన వాడూను. మల్లు పంచె కట్టి - గ్లాస్కో- లాల్చీ తొడిగి - జరీ కండువా వేసుకొని బయల్దేరుతోంటే రుక్మిణి ముచ్చటగా చూసుకొంటుంది.

ఈడూ జోడూ విషయంలో మాత్రం రుక్మిణి వెంకట్రాయుడికి ఏమంత సరిపడదనే చెప్పుకోవాలి — పాపం రుక్మిణి పొట్టి, పొట్టివాళ్ళ కంటే మరికాస్త పొట్టి. వెంకట్రాయుడి దగ్గిర నిలబడితే అసలే పొట్టి.

"పొట్టి పిచ్చుకలాగ నువ్వు నా గుండెల దగ్గిరకైనా రాలేదే!" అంటూ హాస్యాలాడుతూనే వుంటాడు రాయుడు.

"పోనిద్దురూ! మీ ముచ్చటలకు నేనేం అడ్డు రావటంలేదుగా? నా ఖర్మనాది" — అని నవ్వేస్తూంటుంది రుక్మిణి.

"విజ్జీ! ఏవిటే మాట్లాడకుండా కూర్చున్నావ్? నేనెలా ఉంటానని అడిగితే చెప్పనేలేదేం?"

విజయ ప్రేమగా అంది - "నువ్వు చక్కగా ఉంటావ్ అత్తా!"

"ఛ! పొట్టిగా, అందంగా ఉండనటకదూ? చూడు. మీ అమ్మావాళ్ల పొడుగ్గా నిండుగా ఉంటారు."

"ఎందుకేమిటి అంత పొడుగు? నువ్వే బావుంటావ్ నాకు.

రుక్మిణి నవ్వుతూ అంది — "మా విజ్జికి నేనంటే చాలా అభిమానం." పచ్చడి రుబ్బుతోన్న అత్తకేసి చూస్తూ కూర్చుంది విజయ. ఉన్నట్టుండి అడిగింది - 'అత్తా! అది నీగదిలో కూర్చుంది కదా దెబ్బలాడవేం?'

"ఛ! దెబ్బలాడకూడదే! అదే వెళ్ళిపోతుందిగా మళ్ళా." విజయకేం నచ్చలేదు. మరేం అడగలేదు. అడిగినా అత్త సరిగ్గా చెప్పటం లేదుగా! కాస్సేపు బుద్ధిగానే కూర్చుంది హఠాత్తుగా అంది —

"అది వెళ్ళిపోయిందేమో చూసిరానా?"

"దాని గోలెందుకే నీకు? కూర్చో—అన్నం పెడతాను. మధ్యాహ్నం వెల్దుగాని యింటికి."

పచ్చడిలో చిట్ట చివరో వెల్లుల్లి గడ్డ చితిపి పడేసి జాడీలోకి తీసుకు లేచింది రుక్మిణి. ఆ చేత్తోనే విజయకి అన్నం పెట్టి కమ్మగా నెయ్యివేసి కంది పచ్చడి ముద్దలు కలుపుతూ కూర్చుంది.

పెరటి వేపుకు వచ్చాడు వెంకట్రాయుడు — "ఉడుకు నీళ్ళున్నాయేమో తోడి పడెయ్యి"!

"విజయ ఎంత గొడవ చేసిందో చూశారూ?" - అంటూ నవ్వుతూ లేచింది రుక్మిణి — పొంత కుండెడు నీళ్ళు చేదలోకి దిమ్మరించి వేపచెట్టు కింద పెట్టి వచ్చింది. తుండుగుడ్డ తీసుకెళ్ళి కొమ్మమీద వేళ్ళాడేసింది .... నీళ్ల దిమ్మరించుకుంటున్న మొగుడికి ఎదురుగా నిలబడి హాస్యంగా అంది.

"పొలం పని కొత్త ఆడది రావటం పాపమనుకుంటాను."

"అఘోరించావ్‌గాని అన్నం వడ్డిద్దూ వచ్చేస్తున్నాను."

విజయ పక్కనే పెద్ద పీటవాల్చి వెండికంచంలో అన్నం కూరలూ వడ్డించిది. రాయుడు ఒళ్ళు తుడుచుకుని పీటమీద కూర్చుంటూ విజయ వీపు మీదో చరుపు చరిచాడు — "మీ అత్తకేం కోపంలేదుగానీ - నీకు కోపం వచ్చిందంటే పిల్లా?"

సిగ్గుపడి తల దించేసుకుంది విజయ.

"ఇది మొగుణ్ని బాగా సాధించేలాగే వుంది" — అంటూ నవ్వింది రుక్మిణి.

మరోసారి మధ్యాహ్నం రెండు గంటల వేళ —

"అత్తా! గాజులమ్మి వీధిలో పోతోంది పిల్చేదా! గాజులు వేయించుకోవాలన్నావుగా నిన్న?" - హడావిడిగా వచ్చిపడింది విజయ.

"అవునే విజ్జీ. చేతులు నిండుకున్నాయ్. పిల్చుకు రాలేకపోయావ్? అది వెళ్ళిపోతుందో ఏమో!" — అంటూ కొంగు పరుచుకుని పడుకున్న రుక్మిణి లేచి చావిట్లోకి వచ్చింది— అప్పటికే బైటికి పరుగెత్తింది విజయ. ఓ ఘడియకి గాజుల కనకాన్ని వెంటబెట్టుకుని వచ్చింది - అది బస్తీనుంచి గాజు లమ్మతెచ్చే బడాయి కుర్రది. ఆ మధ్యనే కొత్తగా వస్తోంది వూళ్ళ వెంట. కనకం గోనెసంచులతో గాజులమ్ముకునే మలారం మనిషిలా ఉండదు. అద్దాల పెట్లోంచి గాజులు పైకి కన్పిచేలాగ రంగు రంగులుగా పేర్చి చేత్తో పట్టుకుంటుంది — దాని దగ్గిర గాజులు కొనుక్కోటం ఆ వూళ్ళో చాలా మంది ఆడపిల్లలకి సరదా - గర్వం కూడాను.

ఆ రోజు కనకం జిలుగు టజుగుల్లా పెనవేసుకొన్న తీగల చీర కట్టుకుంది. - చీరకుచ్చెళ్ళు రోడ్లు తుడిచేలా నేలమీద పారాడుతున్నాయి. చెంపలు ఎగ దువ్వుకుని నడినెత్తిమీద బర్మాముడి చుట్టింది. అస్తమానూ తమలపాకులు నములుతూ ఉంటుందేమో పళ్ళు, పెదాలు గారపట్టి పుగాకు రంగుతో కన్పిస్తున్నాయి. చెంపలమీద పౌడర్ చెమటకి తడిసి మచ్చలు కట్టింది. చావిట్లోకి వస్తూనే చెమ్కీచారల చెప్పులు గుమ్మం వారగా విడిచింది.

రుక్మిణి అంత వరకూ కనకం దగ్గిర గాజులు కొనుక్కోలేదు. ఓ సారి దానికేసి ఆశ్చర్యంగా చూసి ఈతాకుల చాప తెచ్చి పరిచింది.

కనకం వెకిలిగా నవ్వుతూ చావిడంతా ఓ సారి కళ్ళు తిప్పి చూసి చాపమీద కూర్చొని పెట్టె తెరిచింది. అంతలోనే మొహం తుడుచుకుని చేతి గుడ్డతో గాలి విసురుకోవటం మొదలు పెట్టింది.

"ఎండలోంచి వస్తే మరీ వుక్కగా ఉన్నట్టుంది. విజయా కాస్త

లోపలికి వెళ్ళి విసనకర్ర తీసుకురావే" అంటూ పురమాయించింది రుక్మిణి. గాజుల కనకం కేసి కన్నార్పకుండా చూస్తూ కూర్చున్న విజయ బలవం తంగా లేచింది. కనకాన్ని చూసినకొద్దీ చూడాలనిపిస్తుంది పిల్లవెధవలకి. పెళ్ళిపందిట్లో గ్యాసులైట్ల వెలుగులో డాన్సుచేసే భోగం దానిలాగే వుంటుంది కనకం. అలాగే అస్తమానూ వుత్తపుణ్యానికి ఇకిలిస్తూ ఉంటుంది.

ఒక్క నిమిషంలో చేటంత విసనకర్ర తీసుకు పరుగెత్తుకు వచ్చింది విజయ. "కొంచెం మజ్జిగ తాగుతావూ? నీ పేరు కనకం కావును విన్నాలే" — అంది రుక్మిణి దాని చెమటలు చూడలేక.

కనకం ఇబ్బందిగా చిట్లించింది మొహం - "చల్ల .... వద్దుబాబు కాసిన్ని టీ నీళ్ళిస్తే తాగుతాను" - అదోలా నవ్వింది.

"టీలు కాఫీలు మా యింట్లో వుండవు మరి. పోనీ పాలు కావా లంటే తాగు" — అంటూనే "దాలి మీద కుండలో వున్నాయి కాసిన్ని గాజు గ్లాసులోకి ఒంపుకు రావే విజ్జీ! జాగ్రత్త! కుండ బద్దలు కొట్టేవు"

పాలు తాగి విసనకర్రతో కాస్సేపు విసురుకుని గాజులు చూపిం చటం మొదలు పెట్టింది కనకం.

మధ్యాహ్నం నిద్ర ముగిసి లేచి గదిలోంచి బైటికి రాబోయిన వెంకట్రాయుడు గుమ్మం దగ్గరే ఆగిపోయాడు. ఎదరగా కన్పిస్తున్న చెమ్కీ చెప్పులకేసి చూస్తూ.

"ఈ గాజులు తీసుకోండమ్మా! అర్ధాంగి గాజులు. పెళ్ళాం వేసు కుంటే చాలు మొగుడు బంద్ అయిపోయినట్టే! కుక్కలా వెంటపడ తాడు ...." తన చమత్కారానికి తనే విరగడి నవ్వుతోంది కనకం. పెడ కాళ్ళు వేసుకుని ఒయ్యారంగా కూర్చుని గాజులు విప్పి చూపిస్తోంది.

"తీసుకుంటాలే ఇంకా రకాలు చూపించు" - అంది రుక్మిణి.

"ఇవి చాలా బావున్నాయత్తా. గమ్మున తీసుకో" అంటూ కంగారు చేస్తోంది విజయ.

వెంకట్రాయుడు ఆరాటంగా గాజుల కనకంకేసి చూస్తూనే నించు న్నాడు - కాసేపటికి మళ్ళా లోపలికి వెళ్ళిపోయి — "జయా! మీ అత్త

నిలా రమ్మను" – అంటూ కేక లెట్టాడు రెండుమూడు సార్లు.

గాజుల ఎన్నిక ఆపుజేసి వెళ్ళింది రుక్మిణి. వెనకే గదికేసి చూస్తూ కూర్చుంది కనకం —— కాస్సేపటికి మామ్మూలుగా చావిట్లోకి వచ్చింది రుక్మిణి —— వెంకట్రాయుడు కనకం కేసి కోరగా చూస్తూ తీవిగా నడుస్తూ వీధిలోకి వెళ్ళిపోయాడు. కనకం ఒకటి రెండుసార్లు వీధికేసి చూసి మళ్లా గాజుల బేరంలో పడింది.

"నా గాజులు తరువాత తీసుకుంటాగానీ ముందీ పిల్లకి అందమైన గాజులు వెయ్యి" అంటూ విజయ చేతులు అందించింది రుక్మిణి.

"నేను మొన్ననే వేయించుకున్నా నత్తా!" —— అంటున్నా విన్పించుకోకుండా కొత్తగా నాలుగేసి తళుకు గాజులు వేయించింది విజయకి.

"మీ గాజులు కూడా గమ్మని చూసుకోండి. నేను పోవాల ——" కంగారు పడింది కనకం.

"పోనీ ఊళ్లో అమ్ముకురా! తర్వాతే తీసుకుంటాలే నేను"– తాపీగా కూర్చుంది రుక్మిణి.

"పొద్దుపోద్దమ్మా ఏకంగా అమ్ముకుపోతాను. చీకట్లో స్టేషన్ కాడికి నడిచి పోవాల."

"అంత చీకటి పడితే మా యింట్లో వుండిపోదువులెద్దూ! ఏం? మేం మాత్రం మనుషులం కామా? ఒక్కపూటకి ఆదరించలేమా?"

"అదేం మాటమ్మా? యింటికాడ మా యజమాని ఎదురు చూస్తూడడా?"

"చూస్తే చూస్తాళ్ళే. చీకటిపడి వెళ్ళలేనప్పుడేం చేయగలవ్? ఈ పూట మా యింట్లో వుండాల్సిందే! పది రూపాయల గాజులవరకు తీసుకుంటాను. తీరికగా చూసుకోవాలా వద్దా?"

"అయితే ముందు ఊళ్ళోనే చూసుకురమ్మంటారా?"

"ఆఁ వెళ్ళిరా! మర్చిపోకు సుమీ!"

"అయ్యో! ఇంత పెద్దబేరం పోగొట్టుకుంటానేంటమ్మా?" – మళ్ళా గాజులన్నీ పెట్టెలో సరుకుని లేచింది కనకం.

"అత్తా! ఇప్పుడే తీసుకోకూడదూ!"

"తీరికగా తీసుకుందాం లేవే! తొందరేమొచ్చే!"

రుక్మిణి వంటపాకలోకి వెళ్ళి ఓ సోలెడు మినప్పప్పు నీళ్ళలో పోసి వచ్చింది. సాయంత్రం అరకోడిపిల్ల నోదాన్ని కోయించింది. కాసిన్ని గారెలు వండింది. జీడిపప్పు - యాలకపొడి వేసి సగ్గు పాయసం కాచింది.

గాజుల కనకం వచ్చేసరికి వేడి నీళ్ళు కూడా తోడించింది. కనకం వచ్చేసరికి బాగా చీకటి పడింది. వస్తూనే ఉస్సురంటూ కూలబడింది.

"కాస్త ఒళ్లు కడుక్కుంటావూ?"

"ఇప్పుడేం స్తానంలేమ్మా! కాస్త తిండి తిని పడుకుంటాను."

"ఇలా బద్ధకించకేం. నీళ్ళుపోసుకుంటే .... ఎండలో తిరిగావేమో — సుఖంగా వుంటుంది ప్రాణం. పాలేరు తోడిపెట్టనేపెట్టాడు దొడ్లో. ఒళ్లుతుడుపు గుడ్డా - సబ్బు బిళ్లా అక్కడే వున్నాయి, లేచి వెళ్ళు."

కనకానికి బద్ధకం పోయింది. సబ్బుతో ఘుమఘుమలాడేలా ఒళ్లు తోముకు నీళ్ళు పోసుకుంది. ఓసారి ఆశ్చర్యంగా చూసి రుక్మిణి అందించిన చాకింటి చీర కట్టుకుంది. నైట్‌క్వీన్ గుత్తులు రెండు తెంపి చుట్టలోకుక్కుకుంది - అదంతా చూస్తోంటే మహదాశ్చంగా వుంది విజయకి — "అత్తా కనకం యిక్కడెందుకుండి పోయింది?" — అంటూ గుసగుసలాడుతూ అడిగింది, రుక్మిణి వెనకే తిరుగుతూ.

"పాపం చీకటి పడిపోయిందిగదా? బస్తీ ఎలా పోతుంది? పోనీ ఈ రాత్రికి వుంటే మనదేం పోయింది?"

కోడిమాంసం - గారెలూ - పాయసం - వగైరాలతో ఆపసోపాలు పడుతూ తింటోన్న కనకాన్ని చూస్తే విజయకి మళ్ళా ఆలోచన వచ్చింది: "అత్తా కనకం మనకి చుట్టం కాదుగా! ఇవన్నీ ఎందుకు వండావు?"

"ఛ! దాని కోసం వండానా ఏమిటి? మనం మాత్రం తినటంలేదూ? మీ మామయ్య వండమంటే వండాను."

"అత్తచెప్పే కబుర్లు ఏవీ విజయకు సంతృప్తి కలిగించలేదు హడావుడిగా పాలేళ్ళ మీద అరుస్తూ తిరిగే మామయ్యకూడా ఎందుకో నెమ్మదిగా మాట్లాడుతూ వాళ్ళని తొందరగా పంపేశాడు. పెరట్లోకి చావిట్లోకిఅదే పనిగా తిరుగుతున్నాడు. కనకం కేసి చూసి నవ్వుతోంటే అదేమిటో సిగ్గు

పడిపోతున్న దానిలా తలుపుచాటుకి నక్కింది.

విజయ గబగబా రుక్మిణి దగ్గిరకి వెళ్ళి "అత్తా! గాజుల కనకం ఎక్కడ పడుకుంటుంది?" - అని అడిగేసింది రహస్యంగా.

"లంకంత ఇంట్లో అది పడుకోటానికి చోటులేదా? మనం మాత్రం ఈ పెరట్లోనే పడుకుందాంలే. పద. వంటపాకతలుపులు వేసి వస్తాను."

విజయ జాగ్రత్తగా చూస్తూనే వున్నా — కనకం వెంకట్రాయుడి దగ్గిరకి ఎప్పుడెళ్ళిపోయిందో అర్థం కాలేదు — గుండెలు కవికేలా పరుగెత్తుకొచ్చింది — "అత్తా! చూశావా? కనకం మామయ్య దగ్గిర కూర్చుని చెప్తోంది .... దక్షిణంవేపు దొడ్లో - నవ్వుతోంది కూడాను."

"మీ మామయ్య బస్తీ కబుర్లేవో అడుగుతున్నారు కాబోలు. అదే వస్తుందిలే. రా ఇలా పడుకుందాం.

మొహం చిట్లించుకుని విజయ - ఛీ! అది మా మామయ్య దగ్గిర ఎంత .... దగ్గిరగా కూర్చుందను కున్నావ్ మంచంమీద?" — ఎంతచెప్పినా అత్త గ్రహించలేక పోతోందని - మామయ్యేదో చాలా తప్పుపని చేస్తున్నాడనీ — పాపం అత్తని అంతా మోసం చేస్తున్నారనీ విజయ బాధ! అత్త చాలా మంచిదికానీ మామయ్య బొత్తిగా చెడ్డవాడు.

మర్నాటి పొద్దున్నకూడా చాలాసేపు గదిలోనే పడుకుంది. కొట్లోంచి కాఫీపోడి తెప్పించి కాఫీ కాచి ఇస్తే తాగింది. పది గంటలకల్లా అన్నం తింది. నాలుగైదు రకాల గాజులు ఏరి ఇచ్చింది రుక్మిణికి. అదోలా నవ్వుకుంటూ తన చీర సంచీలో కుక్కుకుని రాత్రి కట్టుకున్న చీరతోనే బయల్దేరింది.

"నీ చీర అడగవేం అత్తా?" - అనాలనుకున్న విజయ - నవ్వుతూ అత్తేదాన్ని సాగనంపుతోంటే ఏమీ మాట్లాడలేక చూస్తూ వూరుకొంది.

* * *

విజయకి చాలా వరకు జ్ఞానం తెలిసివచ్చింది. అది పెద్ద మనిషై ఆకుల మీద కూర్చున్న ఘడియనుంచే దాన్నో ఆరిందానిచేసి అమ్మలక్క

లంతా ఎన్నడూ మాట్లాడుకోని విషయాలు — దానిముందే ముచ్చటించు కోవటం మొదలు పెట్టారు.

"ఏవమ్మోయ్! మంగమ్మొదినా! నీ కూతురు సమర్తాడి కూర్చుంది. ఇక ఆలశ్యం చెయ్యకుండా అల్లుణ్ని వెదకాలి. లేకపోతే నీ కూతురసలే నెరజాణ. ఎవణ్నో లేవదీసుకు చక్కా పోతుంది —" చెణుకువిసిరిందో పేరంటాలు.

విజయకి అక్కవరసయ్యే ఓ పడుచుపిల్ల — "ఆపోవటం కాస్తా ఈ అత్త కొడుకుతోటే పోవే విజ్జీ!" - ఫక్కుమంది.

"ఆ మూడు రోజుల్లోనే విజయకి మొగుడు పెళ్ళాల రహస్యాలూ— అందుకోసమే లేచిపోడాలూ — కడుపులు తెచ్చుకోడాలూ — భయంకొద్దీ పిల్లల్ని కని పారెయ్యడాలూ — చాటు చాటుగా పరాయివాళ్ళతో తిరగ డాలూ — అన్నీ అర్థమైపోయాయి.

రాయుడు మామయ్య కొత్త కొత్త ఆడవాళ్ళ నెందుకు తీసుకు వస్తాడో కూడా తెలిసిపోయింది — మరి అత్త ఎందుకు ఊరుకుంటోంది? నిజంగా అత్తకి తెలీదు.

పేరంటాళ్ళ కబుర్లలో రుక్మిణి మాటలుకూడా దొర్లక పోలేదు. "దానికేం సిగ్గు తల్లీ? ఆడపుట్టక పుట్టిందీ? చీమూ నెత్తూరూ వున్నాయీ? ఎవతైనా మొగుణ్ని చేతులారా మరో ఆడదానికి అప్పగించ గలదూ?"

"నేనే అయితే మూడోనాటికి వురిపోసుకు చచ్చేదాన్ని — పాడు మొగుడితో ఏం సుఖపడాలి గనకా?"

"వాడు బాధ పెడతాడనా ఏవిటి నీ ఉద్దేశ్యం? ఎబ్బే! దీనికి మొగు డంటే తగని గారం మొదట్నుంచి ఇదే కొమ్ములిచ్చింది."

"అలాంటి కబురు వింటేనే ఒళ్ళు దహించుకు పోతుంది గదా? రుక్మిణి ఎలా భరిస్తోందో? దాని మంచితనం మెచ్చుకోవాల్రా!"

"పోదూ! నీ వేదాంతం నువ్వూను. అదేం మంచితనం, వల్ల కాటి మంచితనం!"

అంతా రుక్కు అత్తని ఈసడించు కుంటోంటే విజయకి జాలి వేసింది. పాపం అత్త మాత్రం ఎందుకలా చేస్తోంది?

విజయకి స్నానం అయిన్నాడు రుక్మిణి ఏవేవో ఫలహారాలవీ తీసుకొచ్చింది - "విజయ నాలుగు రోజులు మా యింట్లో భోంచేస్తుంది. పంపు వదినా?" - అంది వాళ్ళమ్మతో.

మంగమ్మ అయిష్టాన్ని బైటికి కన్పించ నీయకుండా- "ఈడేరిన పిల్ల! ఇదివరకులా ఎందుకులే రుక్మిణీ, పొరుగిళ్ళవెంట! —" అని తప్పించు కోవాలనే చూసింది. రుక్మిణి ఊరుకోలేదు- "అవునవును వదినా. నా కడుపున వొక్క- ఆడపిల్లయినా పుడితే విజయలాగే పెద్దమని షయ్యేది ఈపాటికి. ఆభాగ్యం నాకు లేకపోయింది. నీ అంత ప్రేమతో నేను చూడ లేకపోయినా విజయంటే నాకు పంచప్రాణాలూను. నాచేత్తో దానికి నాలుగు రోజులు వండిపెట్టనీ! కాదనకు"- అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది- మరేమి అనలేక- "సరేలే వస్తుందిలే" అనేసింది మంగమ్మ.

విజయకి మొగుడూ పెళ్ళాల కబుర్లన్నీ తెలిసిపోయాక అత్తతో ఎన్నో విషయాలు మాటాడాలని వుంది. మరెన్నో అడిగి తెలుసు కోవాలని వుంది. ఎప్పుడూ తనింత పెద్దదానిలాగా ఆలోచించలేదు.

* * *

విజయని భోజనానికీ తీసికెళ్ళింది రుక్మిణి. అత్తని ఏదో అడగాలను కుంటూనే రెండు రోజులు గడిపింది. మూడోనాడు- సాయంత్రం- కను చీకటి పడేవేళ .... చాకలివాడి కొత్త కోడలు ఎంకి బట్టలు తీసుకొచ్చింది. మూట విప్పి మడతలన్నీ దండెంమీద వేసింది. బుట్టలోంచి అన్నంగిన్నె తీసి గోడవారగా పెడుతూ- "ఈ పూట కసింత వూరగాయి వూట పడెయ్యా లండోయ్ దొరసానమ్మ గోరూ! "అంది.

"వేవిళ్ళేమిటే నీకు?"- అంటూ వంటపాకలోంచి బైటికి వచ్చింది రుక్మిణి.

"పోండమ్మా!"- సిగ్గుపడుతూ చీడీల దిగువ కూర్చుంది ఎంకి.

చీకట్లో దాన్ని దగ్గరగా చూసిన విజయ- "అత్తా! ఎంకి నీ చీరే కట్టుకుందే-" అంది.

రుక్మిణి నవ్వుతూ– "అదే నేనూ చూస్తున్నానులే, ఈచీర నువ్వు కట్టుకుంటే ఎంచక్కా వుందేవ్"– అంది ఎంకితో– ఆ వెంకటగిరి సన్న జరీచీర చాకలి బిర్రుగా గోచి దోపింది. పైటకొంగు పిడసలా చుట్టి వీపు మీద నుంచి తీసి బొడ్లో గుచ్చింది – వీపూ – పొట్టా – తొడలూ – నల్లగా నిగనిగ లాడుతూ బలిష్టంగా కన్పిస్తున్నాయి. అంత మంచి చీర చాకల్ది కట్టుకున్నందుకు రుక్మిణికి కోపం రానేలేదు.

పొలం నుంచి వచ్చిన వెంకట్రాయుడు చీడీలమీదే నిలబడి చాకలి ఎంకికేసి చూశాడు – రుక్మిణికేసి చూపులు మార్చాడు. విజయ కేవిటో భయం వేసింది. అత్తకేసి చూడ బోయింది. రుక్మిణి పాకలోకి వెళూ – "అన్నం వారుస్తున్నాను. తీసుకెళుదుగాని– కాస్సేపు కూర్చోవే ఎంకీ!"– అంది.

"రోజూ నువ్వే రారాదటే గుడ్డ లివ్వడానికి"– అన్నాడు. రాయుడు మీసాలమీద చెయ్యివేసుకు నవ్వుతూ.

ఎంకి సిగ్గు పడుతోన్నట్టు తొడల్లో మొహం దాచుకొంది.

"నీ మొగుడు కన్పించటమే మానేశాడేమే? పెళ్ళాం వచ్చిందని మమ్మల్నందర్నీ మర్చిపోయాడా ఏవిటి?"– అంటూ వచ్చింది రుక్మిణి.

"లేదమ్మగోరూ! ఆడికి రేవుకాడే సరిపోతాది. సందేళకి ఉస్సూరంటూ కూకుంటాడు."

"మీ అత్తకి వొంట్లో బాగాలేదన్నారు, యెలా వుంది?"

"అలాగే తినీ తినకా చత్తావుండి బాధపడతా వుంది."

వెంకట్రాయుడు తుండుగుడ్డ కట్టుకుని నీళ్ళ కోసం కేక లెట్టాడు.

"ఒసేయ్ చాకలిపిల్లా! కాస్త ఆ ఉడుకునీళ్ళకుండ దక్షిణంవేపు దొడ్లో పెట్టిరా!

ఎంకి వెంటనే లేచి కుండ భుజంమీదికి ఎత్తుకుంది.

విజయ గుండెలు కొట్టుకున్నాయి భయంతో.

ఎంకి పక్కదొడ్లోకి చలాకీగా నడిచి పోయింది.

రుక్మిణి అన్నం వార్చి ఎత్తి చాకలిదాని గిన్నెనిండా అన్నం పెట్టి నాలుగు గరిటెల ఆవకాయ పచ్చడి వేసింది. ఓ వారగా పప్పుచారు పోసింది

దొడ్లోంచి ఏవో కేకలు .... అదే ధ్యాసగా కూర్చున్న విజయ కంగారుగా లేచింది – "అత్తా ఎంకి కేకలు పెడుతోంది." రుక్మిణి చావిట్లోంచి పరిగెత్తింది. గబగబా వెనకే వెళ్ళింది విజయ — గది తలుపులు బారా తీసివున్నాయి. ఎంకి గోసివూడి కాళ్ళకడ్డంగా వేళ్ళాడుతోంది చీర. జుట్టుముడి లాగేసినట్టు మొహంనిండా వెంట్రుకలు కమ్ముకున్నాయి — చిన్న పిల్లలా నోరు పెద్దదిచేసి ఏడుస్తూ— "గొప్పోర్రైతేమాత్రం గొప్పోరులా వుండాలిగాని యిదేంపని? మానం మర్యాదలేని మనుషులం అనుకున్నారేంటి? నా సత్తెంబావని తప్పితే మరో ఎదవని ఒంటిమీద చెయ్యి వెయ్యనిస్తానా?" — అంటూ తిట్టుకుంటూ యివతలికి వచ్చేసింది — వేళ్ళాడుతోన్న చీర ఎగ్గట్టుకుంటూ వీధివేపు పోబోయింది.

"ఒసే! ఎంకీ! ఎందుకే అంతకోపం? ఒక్కసారి వెనక్కి రా! మాట."

"చాల్లే తల్లీ! నువ్వు చెప్పావని నీళ్ళకుండ తీసికెళ్ళి దొడ్లోదించితే గమ్మున మీదబడి కావిటేసుకుంటాడా పెద్దమనిషి?" — దురుసుగానే మాటలు విసిరేస్తోంది ఎంకి.

రుక్మిణి బ్రతిమాలుకునే ధోరణిలో — "తప్పేలేవే! ఏదో పొరపాటైందిలే — కడుపులోనే పెట్టుకో. అన్నంగిన్నైనా తీసికెళ్ళు" — అంటూ వెంటబడింది.

"ఒద్దులే. మా మావ( వచ్చి తీసుకొత్తాడు, ఆడికే చెప్తాను." మహా కోపంగా చీడీలు దిగిపోయింది — దురుసుగా ఎంకి.

రుక్మిణి వెనక్కివస్తూ మొగుడి కేసి చురాచురా చూసింది— "ఎన్ని సంవత్సరాలు వచ్చినా యింగితం లేకపోతే యెందుకూ? దాని కిష్టమో కాదో కనుక్కోవద్దూ ముందు?"

వెంకట్రాయుడి కింది పెదవి మీదికెత్తలేదు.

విజయ కా యింటి పరిస్థితంతా జుగుప్సాకరంగా తోచింది. అత్త మీద అసహ్యం ముంచుకు వచ్చింది.

పెద్దచాకలి వచ్చి ఏం గొడవ చేస్తాడోనని బిక్కు బిక్కు మంటూ కూర్చున్న అత్తని చూస్తోంటే కాస్త జాలికూడా వేసింది — అర్ధరాత్రి

వరకూ ఎదురుచూసినా చాకలాడి జాడలేదు. మర్నాడు పొద్దున్నే చాకలి ముసల్ది జ్వరంతో మూలుగుతూ వచ్చి ఏ సంగతీ ఎత్తకుండా బట్టలు తీసుకుపోయింది.

*   *   *

"అత్తా! నినోక్కమాట అడిగేదా?" — మధ్యాన్నం భోజనాలయ్యి తీరిగ్గా కూర్చున్నప్పుడు అనేసింది విజయ.

"ఏమిటే అది?"

సిగ్గుపడుతూనే అడిగింది విజయ — "మామయ్య యిన్ని పన్లు చేస్తోంటే నీకు కోపంరాదూ?"

"ఏం పనులే? ఎందుకూ కోపం?"

"ఎందుకేమిటి? నీ కళ్ళయెదురుగానే పరాయి ఆడవాళ్ళని తీసుకొస్తోంటే కోపంరాదూ? అలాంటి తప్పు పనులు చేస్తే ... "

"మగవాళ్లేంచేస్తే మాత్రం తప్పు అవుతుంది? ఎక్కడో రహస్యంగా దొంగ తనంగా వాళ్ళ ఇళ్ళకెళ్ళి ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకు గడిపే కంటే — అంత కోరిక ఉన్నప్పుడు నిక్షేపంలా మన యిల్లూ, మన వాకిలీ మనకి లేవూ?"

"మరి నీకు కష్టంగా వుండదూ?"

"ఎందుకూ? నాకు మాత్రం ఏం లోటు జరుగుతోందనీ?"

"నువ్వుండగా అస లలా ఎందుకు తిరగాలి? పరాయి ఆడదాని మీదికి మనస్సెందుకు పోవాలి?"

"అవకాశాలనుబట్టే కోరికలూ పుడతాయి. వాళ్ళేం చేసినా తప్పు లేదని పదిమంది అంటారు కాబట్టే వాళ్ళ మనస్సులలా చలిస్తాయి. దొంగ చాటుగా పోయేకంటే మనల్ని అడిగే చేస్తోన్నందుకు సంతోషించాలికానీ బాంధెదుకూ?"

"అదేంమాటత్తా? చిన్నపిల్లలు మట్టితింటారు. అది ఆ వయస్సులో సహజమే — మరి అలా వారించకుండా చూస్తూవూరుకుంటామా?"

"నేను మాత్రం బొత్తిగా వారించకుండా వున్నానా?" ప్రయోజనం లేనప్పుడేం చేస్తామమ్మా?"

"నే నన్నమ్మనత్తా! చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను. నీకై నువ్వే ఎంతో మందిని ఆహ్వానించావు. నీ చేతులతో వాళ్ళందరికి వండిపెట్టావు. ముస్తాబులు చేశావు. నీ మనస్సులో ఏ మాత్రం కష్టంవున్నా ఇదంతా చెయ్యగలవా?"

నువ్వన్నట్టు అంత కష్టంకూడా నా కెప్పుడూ కలగలేదు. విజయా! ఆయన వచ్చి నన్ను ప్రాధేయపడుతూ అడిగితే నా కెంతో జాలివేస్తుంది. పోనీ ఈ మాత్రం సాయం చెయ్యలేనా అన్పిస్తుంది. ఏదో విధంగా ఆయన కోరిక తీర్చాలని ప్రయత్నిస్తాను. ఇంత కన్నా నా కేం తెలీదు."

"ఇలా చెయ్యటం తప్పే అత్తా! మన శీలాన్ని ఇంత పవిత్రంగా కాపాడుకుంటాం కదా? మరో ఆడదాన్ని అపవిత్రత పాలు చెయ్యటం ధర్మమే నంటావా?"

"నీ పిచ్చిగానీ, వాళ్ళు మంచివాళ్ళయితే అసలు మనమాట వింటా రేవిటే?

ఎంత వాదించినా అత్త తత్వం ఏవిటో అర్థం కాలేదు విజయకి.

*　　*　　*

సంవత్సరాలు గడుస్తున్నాయేగానీ వెంకట్రాయుడు మారలేదు. రుక్మిణీ మారలేదు — వాళ్లతత్వాలు విజయకి అర్థం కానూలేదు. కాకపోతే వాళ్ల ఆరోగ్యాలు మాత్రం బాగా మారాయి. మందు మింగని పూటలేదు. పత్యంలేని భోజనం లేదు.

నిట్టూర్చింది విజయ.

మామయ్య ఎంత విలాస పురుషుడైనా అదుపులో పెట్టుకోవాల్సిన బాధ్యత అత్తకి వుంది. ఆ ధర్మాన్నావిడ పాటించనేలేదు.

ఈ నాడు మామయ్య భరించలేని రోగాలతో ఆస్పత్రులపాలయ్యాడంటే, అత్తయ్య కుళ్ళి కుళ్ళి ఏడుస్తోందంటే ఎవ్వరేం చేయగలరు? సానుభూతి మాత్రం ఎలా చూపించగలరు?

మామయ్యపట్ల అత్తకి వున్న ప్రేమ అంత ఉత్కృష్టమైనదే అనుకుంటే అటువంటి మూర్ఖపు ప్రేమ ఏ ఆడదీ ఏ మగవాడికీ చూపించకూడదనే విజయ వుద్దేశ్యం.

మామయ్య మరో ఆడదాన్ని తెచ్చుకున్నప్పుడు అత్తయ్య కోపంగా చూసి వుంటే — బావురుమని ఏడ్చివుంటే — చివరి దశలో జీవితంలో ఇద్దరూ సుఖపడేవాళ్ళేమో?

"విజయ్! విజయ్!" — గావుకేక. లేసుకుంటూ వచ్చాడు సారధి.

గబగబా ఎదురు వెళ్ళింది విజయ. సారధికి వెనకే నించున్న రామాన్ని చూస్తూ విస్తుబోయింది - "ఇదేవిటి? నువ్వెప్పుడొచ్చావురా?"

"ఉత్తరం అందిందని బావ చెప్పాడు. స్టేషన్‌కి కూడా వచ్చాడు. నేను వస్తున్నానని నీకు తెలీదూ?" ఆశ్చర్యంగా అన్నాడు రామం. కోపంగా చూస్తోన్న విజయని చూస్తూ నవ్వాడు సారధి —

"చూశావా నా జాలరి ప్రేయసీని! ఎంత బ్యూటిఫుల్‌గా ...."

"చాలుగాని కట్టి పెట్టండి. కాళ్లు విరక్కూడా తప్పించు కున్నారు."

ఇద్దరి సంభాషణా అర్థంకాక తెల్లబోయాడు రామం.

లోపలికి పోతున్న విజయ వెనకే వెళ్తూ గొంతు తగ్గించి - "విజ్జీ! ఇందాక నిజంగా కోపం వచ్చేసింది కదూ నీకు? నా మాటలన్నీ నమ్మేశావు కదూ?" — అంటూ గుసగుస లాడాడు వుండబట్టలేక.

(1964 జూన్ "యువ" నుంచి)